క్లుప్తంగా

దళిత సర్పంచ్‌కు అవమానం..!



సర్పంచ్ రాపాక రాజేశ్వరితో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తాళ్లపూడి: మలకపల్లిలో 1వ తారీఖున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరైన సమావేశానికి మలకపల్లి గ్రామ సర్పంచ్ రాపాక రాజేశ్వరికి ప్రొటోకాల్‌లో స్థానం కల్పించక పోవడాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు తప్పుబట్టారు. ఈ మేరకు మహిళ సర్పంచ్‌ను కలసి గురువారం నాయకులు సంఘీభావం తెలిపారు. జరిగిన అవమానకర ఘటనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, దీనిపై నిగ్గు తేల్చే వరకు పోరాటం చేస్తామని జిల్లా నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు మాదిగ హెచ్చరించారు. అధికారులు గాని, కూటమి నాయకులు గాని జరిగిన అవమానాన్ని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇది పూర్తిగా ఎస్సీ జాతికి జరిగిన అవమానంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్, దానియేల్, గోపి, వీర్రాజు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి

చాగల్లు: వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గురువారం నందిగంపాడు గ్రామ ఉపసర్పంచ్ ఆత్కూరి విజయలక్ష్మిని పరామర్శించారు. ఆమె భర్త వైఎస్సార్ సీపీ నాయకుడు పెద సత్యనారాయణ ఇటీవల పాముకాటుకు గురై మృతిచెందారు. గురువారం బాధిత కుటుంబాన్ని వెంకట్రావు పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పార్టీ తరపున అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చి ఓదార్చారు. ఆయన వెంట పార్టీ ప్రధాన కార్యదర్శి కొండలరావు, మండలాధ్యక్షుడు వెంకట్రావు సర్పంచ్‌లు రాంబాబు, మహాలక్ష్మడు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణాపై కేసు



సీజ్ చేసిన లారీతో ఏఎస్సై గంగాధరరావు

నిడదవోలు రూరల్: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్ లారీని అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏఎస్సై జీఆర్‌కే గంగాధరరావు గురువారం తెలిపారు. కొవ్వూరు మండలం వాడపల్లి ఇసుక ర్యాంపు నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్ లారీని గోపవరం వద్ద కొవ్వూరు డివిజన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పక్క సమాచారంతో సీజ్ చేశారు. కేసు నమోదు చేసి లారీని సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

నిడదవోలు: స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డైరెక్టర్ అధ్యక్షతన గురువారం యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో సమస్యను గుర్తించి వాటికి తగిన సూచనలను అందించాలనేది ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. యువత తమ శక్తి, సామర్థ్యలను గుర్తించి, అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. జీవితంలో స్థిరపడే మార్గాన్ని తెలుసుకోవడమే కాకుండా ఇతరులకు జీవనోపాధి కల్పించే నైపుణ్యాన్ని అలవరచుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పీఎస్ఎస్ స్రవంతి, ఎస్.నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి

ఆర్బీకే వ్యవస్థకు మంగళం..?

- రైతు సేవా కేంద్రాల కుదింపు
- వాటి స్థానంలో పోలీస్ స్టేషన్లు
- రేషనలైజేషన్‌తో నిర్వీర్యానికి ఎత్తుగడ
- ఇప్పటికే అన్నదాతలకు అందని సేవలు



ఎస్.ముప్పవరంలో రైతు భరోసా కేంద్రం



కలవలపల్లిలో ఆర్బీకే కేంద్రం

చాగల్లు: గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సేవలు అందిస్తున్న వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలకు మంగళం పలికేందుకు కూటమి కుట్రలు చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిన (ఆర్‌ఎస్‌కేలు) కూటమి ప్రభుత్వ తీరుతో త్వరలో కనుమరుగుకానున్నాయి. ప్రజా రంజక విధానాలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ నిర్ణయాలు తీసుకుంటోంది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఉన్న ముద్రను చెరిపివేయడమే ఈ నిర్ణయాల వెనుక ఉన్న కక్షలా కనిపిస్తోంది. ఈ జాబితాలో ఇప్పటికే సచివాలయాలు చేరగా, తాజాగా రైతు సేవా కేంద్రాలు (ఆర్‌బీకె)లు) చేరాయి. వరి ఈ–క్రాప్ ఆధారంగా రేషనలైజేషన్ బదిలీ పేరుతో నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా కంకణం కట్టుకుంది. సొంత ఊళ్లోనే రైతులకు అన్ని రకాల సేవలు అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. వీటి ద్వారా పంటల సాగుకు అవసరమైన అన్ని రకాల సేవలు అన్నదాతలకు సకాలంలో అందేవి. సాగులో సూచనలు, సలహాలు అందించడంతో పాటు విత్తనాలు, ఎరువులు అందించేందుకు చర్యలు తీసుకునేవారు. పండిన పంటలకు కూడా గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేసేవారు. తద్వారా రైతులకు ఎంతో మేలు జరిగేది. గత ఎన్నికల్లో అమలుకాని హామీలిచ్చి గద్దెనెక్కిన కూటమి రైతు భరోసా కేంద్రాలను పోలీస్ స్టేషన్లుగా మార్చి కుదించేందుకు ప్రయత్నిస్తోంది.

రేషనలైజేషన్

ఇప్పటికే ఉన్న సిబ్బందిని సర్దుబాటు పేరుతో ఇతర సంస్థలకు బదలాయించేందుకు చర్యలు తీసుకుంటోంది. కూటమి తీసుకుంటున్న ఈ నిర్ణయాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కోవలసిన పరిస్థితి నెలకొంది. పనిలేని చోట ఉన్న వీఏఏలను పని చోటకు సర్దుబాటు చేసే ప్రక్రియ సాగుతోంది. ఒక్కో వీఏఏ పరిధిలో 1,250 ఎకరాలు ఉండేలా నియామకాలు చేపడుతున్నారు.

సేవలకు బ్రేక్

కూటమి వచ్చాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. సాగుకు అవసరమైన రాయితీ విత్తనాల పంపిణీ పోయింది. సబ్సిడీపై ఎరువులను నామమాత్రంగా అందిస్తున్నారు. అది కూడా రైతు సేవా కేంద్రాల ద్వారా కాకుండా సహకార సంఘాల ద్వారా విక్రయాలను చేపట్టారు. ఈ ఏడాది చివరిలో యూరియా అందక రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. తాజాగా రేషనలైజేషన్ పేరుతో రెండు వేల ఎకరాలు సాగులో ఉండే గ్రామాల్లో మాత్రమే రైతు సేవా కేంద్రాలను కొనసాగించాలని నిర్ణయించి కుదింపు అమలుకు శ్రీకారం చుట్టారు. ఆ మేరకు నివేధికలు సిద్ధం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయితే మండలంలో చాలా రైతు సేవా కేంద్రాలు తగ్గిపోనున్నాయి.

పోలీస్ స్టేషన్లుగా మార్పు

చాగల్లు మండలంలో 18 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఇందులో వీఏఏల 9 మంది, వీహెచ్ఎలు 9 విధులు నిర్వహిస్తున్నారు. రేషనలైజేషన్ పేరుతో ఇందులో సగం మందిని ఇతర శాఖలకు పంపించేస్తే మిగిలిన సిబ్బందితో రైతులకు సేవలు అందించడం కష్టంగా మారనుంది.

ఈ కేంద్రాలను ప.గో జిల్లాలోని పలు మండలాల్లో పోలీస్ స్టేషన్లుగా మార్చేందుకు కూటమి ప్రయత్నాలు ప్రారంభించింది. ఇప్పటికే ఉండి, కాళ్లలో స్టేషన్లను ఏర్పాటు చేయగా, ఆకివీడులో నూతన కేంద్రాన్ని సీఐ కార్యాలయంగా మార్చింది.

> **వ్యవసాయం దండగ**
>
> 
>
> గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం అంటే పండగలా మారింది. గ్రామాల్లోనే ఆర్బీకేలను ఏర్పాటు చేయడంతో విత్తు నుంచి విక్రయం వరకు అన్నీ అందుబాటులో ఉండేవి. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి స్థానికంగానే కొనుగోలు చేసేవారు. ఈ ఐదేళ్లు మాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. అన్నదాతకు అండగా నిలిచిన రైతు సేవా కేంద్రాలను కుదిస్తే వ్యవసాయం దండగ అనే భావన మళ్లీ రైతన్నలకు కలవరం మొదలైంది. రైతు సేవా కేంద్రాలను కొనసాగించి అన్నదాతకు అండగా నిలవాలి.
>
> –ఉండవల్లి శ్రీనివాస్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్

> **కుదించడం సరికాదు**
>
> 
>
> గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా అనేక ప్రయోజనాలు పొందాం. విత్తనాలు, ఎరువులు, సాగుకు అవసరమైన అన్ని సేవలు ఊళ్లోనే అందేవి. వ్యవ సాయ శాఖ సిబ్బంది కూడా అందుబాటులో ఉండి పంటలకు ఏమైనా తెగుళ్లు, పురుగు ఆశించిందని చెప్పిన వెంటనే పొలానికి వచ్చి చూసేవారు. అలాంటి కేంద్రాలను కుదించడం సరికాదు. ఇప్పుడు పురుగు మందులు, విత్తనాలు కొనుక్కోవాలంటే దుకాణాలకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. విత్తనాల నాణ్యత తెలుసుకోవడం కష్టంగా మారుతుంది.
>
> –సత్యం సుబ్రహ్మణ్యం, రైతు, బ్రాహ్మణగూడెం

ధర పెరుగుతూ.. ఆనందం పెంచుతూ..

- ఎగబాకుతున్న ధర
- కిలోకు గరిష్టంగా రూ.315
- వారంలో కిలోకు రూ.25 పెరుగుదల



దేవరపల్లి వేలం కేంద్రంలో కొనుగోలు చేసిన పొగాకు బేళ్లు

దేవరపల్లి: పొగాకు మార్కెట్ రోజురోజుకు పుంజుకుంటోంది. పొగాకు ధరలు గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్నాయి. వారం రోజులుగా మార్కెట్లో ధర పెరుగుతూ వస్తోంది. వారం రోజుల ముందు వరకు నిలకడగా ఉన్న గరిష్ఠ ధర పెరిగింది. వారం రోజుల్లో కిలోకు గరిష్ఠ ధర రూ. 25 పెరగడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. వేలం ప్రారంభం నుంచి దాదాపు 77 రోజులు జరిగిన కొనుగోలులో మార్కెట్లో కిలో గరిష్ఠ ధర రూ. 290 నిలకడగా కొనసాగింది. దీంతో రైతులు ప్రధానంగా కౌలు రైతులు ఆందోళన చెందారు. ఈ ధర జూన్ 25 నుంచి స్వల్పంగా పెరగుతూ గురువారం మార్కెట్లో కిలో గరిష్ఠ ధర రూ.315 పలికింది. మంగళవారం రూ.300 పలకగా, బుధవారం రూ.310కు చేరింది. దీంతో ముందుగా అమ్ముకున్న రైతులు కిలోలకు సుమారు రూ. 25 నష్టపోయారు.

81 రోజుల మార్కెట్ ఇలా..

గురువారం రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో 3,90,722 కిలోల పొగాకు కొనుగోలు చేశారు. దేవరపల్లి వేలం కేంద్రంలో 30,754 కిలోలు కొనుగోలు చేయగా, కిలో గరిష్ఠ ధర రూ.314, కనిష్ఠ ధర రూ.200, సగటు ధర రూ.262.47 లభించింది. జంగారెడ్డిగూడెం–1 వేలం కేంద్రంలో 46,499 కిలోల పొగాకు కొనుగోలు చేయగా, కిలో గరిష్ఠ ధర రూ.314, కనిష్ట ధర రూ. 200, సగటు ధర రూ. 277.95, జంగారెడ్డిగూడెం–2 వేలం కేంద్రంలో 42,733 కిలోల పొగాకు కొనుగోలు చేయగా, కిలో గరిష్ఠ ధర రూ.315, కనిష్ఠ ధర రూ.207, సగటు ధర రూ.274.09 పలికింది. కొయ్యలగూడెం వేలం కేంద్రంలో 38,601 కిలోల పొగాకు కొనుగోలు చేయగా, కిలో గరిష్ఠ ధర రూ.314, కనిష్ఠ ధర రూ.200, సగటు ధర రూ. 280.18 లభించింది.

గోపాలపురం వేలం కేంద్రంలో 37,883 కిలోల పొగాకు కొనుగోలు చేయగా, కిలో గరిష్ఠ ధర రూ. 314, కనిష్ఠ ధర రూ.220, సగటు ధర రూ.281.32 రైతులకు లభించింది. ఇప్పటి వరకు 81 రోజులు వేలం జరగ్గా రూ.690.41 కోట్ల విలువ గల 25.25 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగినట్టు బోర్డు అధికారులు తెలిపారు. 1,96,420 బేళ్ల వేలం నిర్వహించినట్టు అధికారులు తెలిపారు.

> **ఇదే తంతు..**
>
> ప్రతి ఏటా పొగాకు మార్కెట్లో జరుగుతున్న తంతు ఇదేనని కొనుగోళ్లు ప్రారంభించిన సగం రోజుల తర్వాత ధర పెరుగుతుందని, ముందు అమ్ముకున్న రైతులు నష్టపోతున్నామని, చివర్లో అమ్ముకున్న రైతులకు మేలు జరుగుతుందని సన్నచిన్నకారు, కౌలు రైతులు వాపోతున్నారు. మార్చి 24 నుంచి జూన్ 24వ తేదీ లోపల అమ్ముకున్న రైతులకు కిలో గరిష్ఠ ధర రూ.290 పలికినప్పటి ఎక్కువ శాతం పొగాకు రూ.260 నుంచి 270 ధర లభించింది. వారం రోజుల వ్యవధిలో కిలోకు రూ.25 ధర పెరగడంతో రైతులకు కొంత వరకు ఊరట లభించినట్లయింది. ఈ ధర ముందుముందు ఇంకా పెరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు. వచ్చే వారం నాటికి కిలో గరిష్ఠ ధర రూ.350 పలుకుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

తాడిపూడి ఎత్తిపోతల నుంచి నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న మంత్రి రామానాయుడు, ఎమ్మెల్యేలు

తాళ్లపూడి: మండలంలోని తాడిపూడి ఎత్తిపోతల నుంచి జల వనరు శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు గురువారం నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, అధికారులతో పంప్ హౌస్ వద్ద పూజలు నిర్వహించి, గోదావరికి హారతి ఇచ్చి మోటార్ స్విచ్ ఆన్‌చేసి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాగునీటిని విడుదల చేశారు. 14 మండలాలకు చెందిన 135 గ్రామాల్లోని రైతాంగానికి కాలువల ద్వారా 2 లక్షల 6 వేల ఎకరాలకు సాగునీటిని సరఫరా చేయాలన్నదే ఈ పథకం లక్ష్యమన్నారు. పంపింగ్ స్కీం ద్వారా 1,38,000 ఎకరాలకు కాలువల ద్వారా సాగునీరు మెట్ట ప్రాంతంలో ఉన్న 68 వేల ఎకరాలకు సబ్ లిఫ్టుల ద్వారా సాగునీటిని అందజేయాల్సి ఉందన్నారు. ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, తహసీల్దార్ లక్ష్మి లావణ్య, ఏఈలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



దేవరపల్లిలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

దేవరపల్లి: కార్పొరేటర్లకు ప్రోత్సాహ నిధులు ఇస్తున్న కేంద్రం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఎందుకు అమలు చేయడంలేదని నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్ కార్మికులకు పిలుపునిచ్చారు. మండల సీఐటీయూ సమావేశం స్థానిక నాయకుడు ఉండవల్లి కృష్ణారావు ఇంటి వద్ద గురువారం మల్లెపూడి వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎనిమిది గంటల పని విధానం కొనసాగించాలని నాయకులు డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, పర్యవేక్షణ లోపంతో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని, కార్మికులకు సరైన భద్రత సౌకర్యాలు లేవని, వారి సంక్షేమాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత దారుణమైన ప్రదేశాల్లో పొరుగు రాష్ట్రాల కార్మికులు నివశిస్తున్నారని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేయాలని కోరారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నాయకురాలు జి.పద్మకామేశ్వరి, ఆశ వర్కర్ల యూనియన్ నాయకురాలు తొర్లపాటి ఇందిర, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు అయినపర్తి శ్రీనివాసరావు, ప్రభుత్వ పాఠశాలల స్వీపర్స్ యూనియన్ నాయకురాలు గుంటూరు వరలక్ష్మి, రైతు సంఘం నాయకులు ఉండవల్లి కృష్ణారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె. రత్నాజీ, పోతుల ప్రసన్న, వంట గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీరామచంద్రరావు, పి. సతీష్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని 33/11 కేవీ పల్లంట్ల సబ్ స్టేషన్ 11 కేవీ చిక్కాల ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎన్. నారాయణ అప్పారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్‌లోని పల్లంట్ల, చిక్కాల వ్యవసాయ విద్యుత్ సరఫరాకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయానికి 3 ఫేజ్ సరఫరా ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు.

ఉండ్రాజవరం: మండలంలోని 33 కేవీ నిడదవోలు–ఉండ్రాజవరం ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించే కారణంగా మండలంలో 15 గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపి వేయనున్నట్లు నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.నారాయణ అప్పారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

డ్రైవర్ల జీవనోపాధి దెబ్బతీయవద్దు



సమ్మె పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందర్‌బాబు, డ్రైవర్లు

పెరవలి: రవాణా రంగం రక్షణ, డ్రైవర్ల సంక్షేమం కోసం ఈనెల 9వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యం.సుందర్‌బాబు పిలుపునిచ్చారు. మండలంలోని కానూరులో గురువారం నిర్వహించిన వశిష్ఠ గోదావరి డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 2019 మోటార్ వెహికల్ యాక్ట్‌లో భారీ మార్పులు చేశారని దీని వలన ప్రమాదాల జరిగితే డ్రైవర్‌ను బాధ్యుడిగా చేసి, జైలు శిక్షలు, భారీ జరిమానా విధిస్తున్నారని చాలా దారుణమన్నారు. దీనికి తోడు వివిధ రకాల టాక్స్‌ల పేరిట లక్షలాది రూపాయిలు వసూలు చేస్తున్నారని డ్రైవర్లు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని వాపోయారు. అరకొర జీతాలతో కుటుంబాలను నెట్టికొస్తున్నామని పెరుగుతున్న నిత్యావసరాలతో రోజు గడవడం చాలా కష్టంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి కఠినమైన చట్టాలను వ్యతిరేకిస్తూ, డ్రైవర్లకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతోనే సమ్మె చేపట్టినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఊబా మధు, యూనియన్ ప్రెశిడెంట్, పెరవలి శ్రీను పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం కలకలం

నిడదవోలు: పట్టణ పరిధిలోని గాంధీబొమ్మ సెంటర్‌లో గురువారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. స్థానిక 21వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ వాట్సప్‌కు సుమారు 50 ఏళ్లు ఉన్న వ్యక్తి అనుమానాస్పందంగా సెంటర్లో మృతిచెంది ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని పరిశీలించి అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పట్టణ వీఆర్వో గోపమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై జగన్ మోహన్‌రావు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



గాంధీబొమ్మ సెంటర్‌లో గుర్తు తెలియని మృతదేహం

కోటసత్తెమ్మకు ఆషాఢం సారె



ఆషాఢం సారెతో ఆలయంలో భక్తులు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారికి ఆషాఢమాసం పురస్కరించుకుని తడికలపూడికి చెందిన 23 మంది భక్తులు గురువారం సారె సమర్పించారు.

ఈ మేరకు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, దేవులపల్లి రవిశంకర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమలతో డెంగీ వ్యాప్తి

పెరవలి: డెంగీ వ్యాధి దోమల కారణంగా వ్యాప్తి చెందుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు సూచించారు. డెంగీ మాసోత్సవం క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున సదస్సులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోమల పుట్టుకకు నివాసాల చెంత మురుగునీరే ఆవాసాలని, వర్షాకాలం దోమల పుట్టుకకు అనువైన కాలమని మురుగునీరు నిల్వ లేకుండా చూచుకోవాలన్నారు. కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్లు, ఫ్రిజ్‌లు వంటి వాటికి నివాస యోగ్యాలని తెలిపారు. చిన్నచిన్న నీటి నిల్వలు ఉన్న చోట్ల వేస్ట్ ఇంజన్ ఆయిల్ చల్లుకుంటే దోమల పునరుత్పత్తి జరగదన్నారు. ఒకసారి గుడ్ల పెడితే 8 నుంచి 10 రోజుల్లో దోమలగా మారతాయని అవి అనేక వ్యాధులకు మూలకారణమన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జయమణి, సిబ్బంది ఎ.రాజమోహన్, కెవి.నాగేశ్వరరావు, వి.రాజశేఖర్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు పండ్లు పంపిణీ

నిడదవోలు: ఇండియన్ క్రిస్టియన్ డే సందర్భంగా నిడదవోలు రీజనల్ పాస్టర్స్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. దేశంలో క్రైస్తవ్యం విశిష్ట సేవలు వివరించారు. అనంతరం పట్టణంలో లెప్రసి కాలనీ, మానసిక దివ్యాంగుల పునరావాస పాఠశాల(హృదయాలయం)లో పండ్లు, డింక్స్, స్నాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ వి.రాంబాబు, వైస్ ప్రెసిడెంట్ బి.నవీన్‌కుమార్, జాయింట్ సెక్రటరీ కె.మధు, ఎగ్జిక్యూటివ్ కె.ప్రకాష్, మణికుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పూరి జగన్నాథుని రథయాత్ర

చాగల్లు: మండలంలోని నెలటూరు శ్రీ సత్య న్నారాయణస్వామి ఆలయంలో పూరి జగన్నాథుని రథోత్సవ వేడుకను గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో జగన్నాథుని ఉత్సవ విగ్రహాలను ఉంచి నెలటూరు స్వామి వారి ఆలయప్రాంగణం నుంచి ప్రారంభించి గ్రామ పుర వీధుల్లో ఊరేగింపును కన్నులపండుగలా చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు మహిళలు, పురజనులు పాల్గొని రథోత్సవాన్ని విజయవంతం చేశారు.